# గల్పిక

"గల్పిక" అంటే అనడిగింది సువర్చల. తెలుగు ముఖ్యాంశంగా తీసుకుని యెమ్మే పాసైంది. రిసెర్చ్ స్టూడెంట్. వాళ్ళ పిన్ని గూడా తెలుగు యెమ్మేయే. జూనియర్ కాలేజీలో లెక్చరర్ పని చేసి రిటైరైంది. పొద్దుటోక ట్యూషన్సు తీసుకుంటుంది. ఆమె స్టూడెంట్సుకి తెలుగులో తొంభై శాతం మార్కులు వస్తాయి. విద్వాన్ పరీక్ష రాయబోయే స్టూడెంట్సు ఫస్ట్క్లాస్ వస్తుందని ట్యూషన్‌కి వస్తారు.

కూచో సువర్చలా, వస్తూనే నుంచునే ప్రశ్న వేశావే. మాస్టర్ డిగ్రీ వచ్చినా యింకా తెలుగు రాలేదూ? పనైంది, సాయంకాలం అయిదైంది. నెలల మనమరాలికి స్వెట్టరల్లుతున్నది. శీతాకాలం వచ్చేసింది. కార్తీకం ముగిసింది. పుష్యమాసం వుండంటీ చలి అని యింగ్లిష్ వూలు లేతరంగు మెత్తనిదని అల్లుతున్నది. ఊలుండా, సూదులూ, వుమెన్ అండ్ హోమ్ అనే ఆంగ్ల మాస పత్రికా యెదురుగా బల్లమీదున్నాయి. పత్రిక తీసి వున్నది. డిజైన్ ఫాలో అవుతూ అల్లుతున్నది పిన్ని సుమిత్ర.

సువర్చల కూచుని పత్రిక వంక చూస్తున్నది.

కల్పన చేసి అల్లిన కథ. యెవర్ని గురించీ వ్రాయలేదని చెప్పటానికి దాని మీద గల్పిక అని వ్రాస్తారు కొంతమంది రచయితలు.

అన్నీ రైటింగ్సూ కల్పితాలేగా. ప్రత్యేకించి వ్రాయట

మెందుకూ. తన చేతిలోని కథల సంపుటి బల్లమీదుంచింది సువర్చల.

నాద బ్రహ్మ త్యాగరాజస్వామి నౌకాభంగమని గల్పిక అల్లి గానం చేశారు. దాన్ని నృత్య నాటికగా వీడియో ఫిల్మ్ తీశారు గూడాను. అసలు కథ గోపికా వస్త్రాపహరణం. పద్ధతి మార్చి మరొక రకంగా గానం చేశారు.

నే వినలేదు. ఫిల్మూ చూడలేదు. పిన్నీ. మార్చి యెలా అల్ల గలిగారు నాదబ్రహ్మ? సువర్చల సూదులందుకుని ఒక సూది మీదికి రింగులెక్కిస్తున్నది.

రిసెర్చ్ మొదలెట్టినట్టున్నావే సువర్చలా. అంతకు ముందున్న దాన్ని పరిశోధన చేసి పైకి తీయటం. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు. అన్నమయ్య కీర్తనలు తిరుపతిలో భాండాగారంనించి తీసి దుమ్ము దులిపి పైకి తెచ్చారు. ఆ కీర్తనలు వెలుగులోకి వచ్చాయి.

యేదీ పరిశోధన మొదలెట్టినవేగా అయింది పిన్నీ. శోధించే ప్రొసీజరు నువే చెప్పాలేమో. వేసిన రింగులకి రెండోవరస అల్లుతున్నది సువర్చల.

గోపికలు బాలకృష్ణుని యమునానది మీద నౌకా విహారానికి రమ్మని పిలిచారు త్వరగా వచ్చేటున్నది. దట్టమైన నల్లమబ్బు

లవిగో వద్దు అంటే గోపికలు యేదో చిన్నపిల్లాడు చెపుతున్నాడని వినలేదు. వెరోవేపు రెక్కలు పట్టుకుని, తమతోపాటు నావలో కెక్కించి, నదిమీద విహరిస్తుండగా నౌక నది మధ్యకి వచ్చేసింది, వాన పట్టుకుని ముదిరింది. నౌక చిల్లులు పడింది. లోనికి నీరెక్క గోపికలు చిల్లులలోంచి నీరు లోపలికి రాకుండా తమ రవికలూ చీరలూ రంధ్రాలలో కూరసాగారు. అయినా చిల్లులెక్కువై, వాటి గుండా నీరు వస్తూ నౌక నిండి అలలకి వానకీ కదులుతూ మునిగి పోసాగింది. అపుడు జ్ఞానోదయమై, వీడు బాలకృష్ణ గాదు దైవమే అని గుర్తు వచ్చి కృష్ణా! మాకేది దారి యింక గుడ్డలు లేవు నౌక మునుగుతున్నది. నది మధ్య వున్నాము, కాపాడు, నీ మాట వినక నీ విలువ తెలియక వచ్చాము అని వేడుకున్నారు. అపుడు కృష్ణ పరమాత్మ దయవల్ల వాన ఆగిపోయింది. గుడ్డలు తీసేసి ధరించారు గోపికలు. నీళ్లు పోయినై. నావ ఒడ్డు పట్టింది, గోపికలు గట్టెక్కి కృష్ణుని దింపి చుట్టూ తిరుగుతూ నాట్యమాడుతూ కొనియాడారు. దాని పేరే నౌకాభంగం. నృత్య నాటికలాగా వీడియో ఫిల్ము తీశారు అని చెప్తూ స్వెట్టరల్లుతున్నది పిన్ని సుమిత్ర.

విజయ వచ్చింది లోపలికి. పిన్ని చూసింది.

రా విజయా, అలా కూచో నువ్వు గూడా, సాయంకాలం పనీ వంటపనీ ముగిసిందా, నవ్వుతూ వచ్చావే యేమిటి విశేషం? పరిశోధన బాగా సాగుతున్నదా? అన్నది పిన్ని.

విజయ కుదురుగా కుర్చీలో కూచుని నవ్వుతూ, సువర్ణల

యేమి చేస్తున్నదో చూసింది. యేదో చెపుతున్నారే పిన్నిగారూ, బయటికే కథ వినిపిస్తున్నా. సువర్చల గూడా పరిశోధనలో చేరి డబ్బు గూడా కట్టేసిం దని విన్నా. యేమైనా తెలియని సంగతి చెప్తున్నారా పిన్నిగారూ? ఈ వూలులిచ్చె నేను వుండ చుట్టనా, ఇంగ్లీష్ వులులాగా వున్నాదే- మెత్తగా వుండి పింక్ కలర్, మనమరాలికి స్వెట్టరల్లుతున్నారా, పుష్యం వచ్చేసింది. నా పరిశోధనా! అయ్యో! ఆ వూసెత్తి చెప్తే పరువుపోతుందేమో మొదలెట్టి పదేళ్ళాయె, ఇంకా పూర్తి గాలేదు. స్కాలర్ షిప్ యేనాడో ఆగిపోయింది అన్నది నవ్వుతూనే.

ఫరవాలేదు విజయా, విచారమెందుకు? ఒక విసిగారు నిజమైన పరిశోధన పన్నెండేళ్ళు పడుతుంది అన్నారు. హేవెల్ పండితుడు ఇరవై యేళ్లు రిసెర్చ్ చేసి పుస్తకం వెలువరించాడట. మీ ఆయన డాక్టరేగా సాయపడలేదూ? అన్నది సుమిత్ర పిన్ని.

విజయ యింకా నవ్వింది. అయ్యో పిన్నిగారూ తెలిసే అడుగుతున్నారా తెలియకే అంటున్నారా? ఆయన వెటర్నరీ డాక్టర్ తన వాళ్ళని రమ్మని ప్రోత్సాహమిస్తూ నాకు పని కల్పిస్తారు. చనవు వల్ల పిలువకపోయినా యేదో మిష పెట్టి వాళ్లే వస్తారు. అత్తారు గదూ మర్యాదలు చెల్లించాలి టైమ్ మిగలదు.

సుమిత్ర కళ్లెత్తి విజయవంక చూసింది.

ఓనాడు నిన్ను అంగీకరించని వారని కథలు విన్నా విజయా, అసలు పెళ్ళికే అడ్డుపడ్డారని చెప్పుకున్నారు. ఆచారాలు వేరు, మడి

మైలలు లేవు, వర్ణభేదం లేదు, విగ్రహారాధన మానేశారు, వైదీకులు గాదు, ఒక శాఖ గాదు, చాలా ఇంకా చిన్న పిల్లలాగా రిసెర్చి అని పేరు పెట్టి చదువుతూనే వుంటావుట. చత్వారం వచ్చి కళ్ళజోడు పెట్టుకుని ఇరవై తొమ్మిదేళ్ళే అంటావుట. అలా నీ గురించి అతని వేపు వారంటుంటే విన్నా అని సిన్నీ నవ్వింది.

అవన్నీ నిజమే అని ఒప్పుకున్నా పిన్నిగారూ! వడ్డించేవాడు మనవాడైతే అనే సామెత వున్నది వినలేదూ. మా అయ్యనేమో గల్పికలల్లటంలో దిట్ట. వాళ్ళ పిలువబడకుండా, చెప్పకుండా వచ్చారనుకోండి, అప్పటికప్పుడు ఆశువుగా గల్పిక అల్లి చెప్తారు నాకు. వడ్డించేవాడాయనేగా యేం చేయగలనూ, నవ్వేస్తాను, ఈ మధ్యే గల్పిక యెంజాయ్ చేశాను. పురమాయించిన పనీ పూర్తి చేశా. పూసుకు తిరిగాను. ఇదో రకం పరిశోధన అని నవ్వింది.

అదే అడుగుతున్నది సువర్చల. గల్పిక అంటే అర్థం కాలేదుట, చెప్తున్నా నువు వచ్చావు. మీ ఆయన అల్లిన గల్పిక చెప్పు. మేమూ అర్థం చేసుకుని ఆనందిస్తాము.

ప్రోత్సాహమందగానే విజయ గల్పిక మొదలెట్టేసింది.

మా ముద్దుల అడపడుచుకి వాళ్ళ వూళ్ళో ఘనవైద్యులు కుదర్చలేని వ్యాధి పీడిస్తుంటే యీ వూళ్ళో చెట్టంత తోడబుట్టిన వాడూ, పెద్దాసుపత్రీ, స్పెషలిస్టూ వుండగా ఆ కుదరని వ్యాధితో బాధపడటం బాగాలేదనీ, తెలివి తక్కువనీ, పోయి రోగం కుదుర్చుకు రా! మంచాన పడతావా! యెవరు చేస్తారు. కూరుచుంటే

లేవలేవు. కూరచట్టి దింపలేవు అని నవ్వుతూ ఆమె నాలుగు రత్నా లంటి నలుగురు పిల్లలూ పూదరపెట్టి బయలుదేర దీశారుట వింటు న్నారా? అని నవ్వింది విజయ.

ఆ. ఆ. వింటున్నాం. కానీ, కానీ అన్నది పిన్ని.

మేనమామకు ఫాక్సు మెసేజి పంపారట. రైలెక్కించాము అమ్మని, స్టేషన్కి కారు పంపు, వీలుంటే నువు రా స్టేషన్కి, నడవక్కర్లేదు గదా.

రైలు కదలబోతుండగా తల్లిని కూకలేశారుట నాలుగు రత్నాలూ. యెక్కడికి పోయినా నువ్వు ఆ వండుకు తినటమేమిటి. మరీ చాదస్తం మితిమీరుతున్నది. మామయ్య పెళ్ళాం వండితే తినాల్సిందే, విగ్రహారాధన మానేస్తేసేం, నీ ఆచారం మంట గలియదులే, ఈ మాటు వండుకు తిన్నావని తెలిసిందా యీ కర్ర లతో బాదుతాం అని అంటే తల్లి దణ్ణం పెట్టి, అలాగే తింటా అన్నదట. రైలు కదిలిందట, అభినయంతో సహా గల్పిక అల్లు తుండగానే వాకిట్లో కారు హారన్ వినిపించి వాకిట్లోకి పరుగెత్తారు. గేటు తీసి, కారు తలుపు తీసి ముద్దుల చెల్లెల్ని దింపుతూ నన్ను కేకలేశారు.

విజయా! మాటల్లోనే నా చెల్లి వచ్చింది. నూరేళ్ళాయుష్షు రా.

పరుగెత్తుకెళ్ళి సాదరంగా లోనికాహ్వానించాను.

అన్నా, ముద్దుల చెల్లీ, హాస్యాలాడుతూ, సరసాలాడుతూ

నన్ను వంటమనిషిగా మార్చారు. ఆడపడుచు అల్లరి చేయకుండా పొన్నెమ్మలాగా బుద్ధిగా అటే మడీ ఆచారం లేనట్టు నటిస్తూ రెండు పూటలా విస్తరెడు భోజనం గుటుకూ గుటుకూ పూర్తి చేసేది. శని వారం ఒక్క పొద్దు రాత్రికి ఫలహారం. ఏకాదశి ఒక్క పొద్దూ అంటే రెండు రొట్టెలు మినపపీ, గిన్నెడు పాయసం, అరటిపండూ అమర్చాలి. యెలాగైతేనేం స్పెషలిస్టు దయవల్ల వ్యాధి కుదిరిపోయి వదిలిపోయింది. ఆరోగ్యం చక్కబడింది. ఇంకప్పుడు తన జిగినీ, మూడు తులాల బంగారం యెర్ర రాళ్ళు వున్నది అమ్మిపెట్టమనీ, దాని గొలుసు యేనాడో అమ్మారనీ, జిగినీ యెవరూ పెట్టుకోరనీ అన్నతో చెప్పింది. సరసమైన ధరకి అమ్మటానికీ పొడులు తొల గించి బంగారం అమ్మి డబ్బు చేయటానికి నాలుగుసార్లు నగలకొట్టు చుట్టూ తిరిగాము ముగ్గురం యెలాగైతేనే ప్రదక్షిణలు మంచి ఫలితాలిచ్చి, రొఖ్ఖం చేతిలో పడింది ముద్దుల చెల్లెలికి. తిరుగు ప్రయాణం నిశ్చయించారు అన్నా చెల్లెలు.

అపుడు రైలు వేళౌతుండగా, ఆడపడుచు విశాలంగా నవ్వుతూ ఓ వందనోటు యిస్తూ అన్నది.

వంట బాగుందే విజయా! నెలరోజులు భక్తి శ్రద్ధలతో చేశావు. ఇది పెట్టి యేదన్నా కొనుక్కో వస్తూ పోతూ వుండాలి నువ్వు, కూతురున్నదన్న మాటే గాని నేనే దానికన్నీ చేయాలి. అపేక్షా లేదు, అభిమానమూ లేదు దానికి, ఇంజనీరు భార్యానని గర్వం కోడళ్ళు సరేసరి, పొరుగింటి పోయిరాళ్ళు.

అని చెపుతూ ఆపేసి నవ్వుతున్నది విజయ.

తీసుకున్నావా నోటు అని అడిగింది సుమిత్ర.

లేదు పిన్నీ. అప్పుడే నా భర్తగారు గల్పిక అల్లి నమ్మించా రని అర్థమైంది. తన సోదరికి సేవ చేస్తూ వినయంగా, మర్యాదగా వుండాలనీ, ఆమె గొప్పింటి బిడ్డ, గొప్పింటి కోడలు, రత్నాలంటి పిల్లలు, మంచి మనసు గలది గనక ఆహారం సడలించిందనీ గ్రహించి రుచిగా వండి పెట్టాలని నన్ను కుక్‌గా నేర్పుగా మార్చా రని వంద యిప్పించాలనీ ప్లాన్ చేశారనీ తెలిసి నవ్వుతూ అన్నా. సంచీలో టానిక్కులూ, రెండు చీరలూ, రెండు రవికల గుడ్డలూ వుంచి అందిస్తూ

అది మీ అన్నగారి కివ్వండి వదినగారూ, అది పెట్టి మంచి వస్తువు కొని తేవటం ఆయనకే తెలుసు. నాకీ పరిశోధనతో ట్రైవేదీ. పూర్తి చేయాలి పరిశోధన,

ఆమెను రైలెక్కించాక డాక్టర్ భర్త అన్నారు.

మా చెల్లికి యెలా మసులుకోవాలో తెలుసు గదూ విజయా. మర్యాద చెల్లించింది. పెద్దవాళ్ళేమన్నా యిస్తే దోసిలి పట్టి అందు కోటం ఆడపిల్ల డ్యూటీ, అది మర్యాద. నీకామాత్రం తెలియదా, నాకివ్వమన్నావేం?

విజయ నవ్వుతుంటే, సుమిత్రా సువర్చలా గూడా నవ్వారు. ఇపుడు గల్పిక అంటే బాగా అర్థమైంది అన్నది సువర్చల. పోతా పిన్నీ దీపాలు వెలిగాయి అని లేచింది, పూలూ సూదులూ బల్ల మీదుంచింది.

నేనూ పోతా పిన్నిగారూ, గాస్ సిలిండర్ పొదుపుగా వాడద్దూ, ఒక పూటే అన్నీ వండేస్తా, కుక్కరు సాయం, రాత్రికి వెచ్చబెట్టి తినేస్తాం. వుండ బల్లమీదుంచి విజయా లేచింది.

[] [] []